



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :159 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 21 జూన్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :159 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 21 JUNE 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

- ఉండవల్లిలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుపై రాందేవ్ ప్రశంసలు
- చంద్రబాబును యోగి, కర్మ యోగిగా అభివర్ణించిన యోగా గురువు
- ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని కితాబు
- ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారిందన్న రాందేవ్
- చంద్రబాబులాగే ప్రతీ ముఖ్యమంత్రి పనిచేస్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- విశాఖలోని ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను సందర్శించిన పల్లా
- ఆరోగ్య రంగంలో సంస్థ సేవలు ఆదర్శనీయమని ప్రశంస
- ప్రోటిజెనిక్స్ స్ఫూర్తితో స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- సంస్థకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ

భారత ఆరోగ్య రంగ స్వావలంబనలో ప్రోటిజెనిక్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రశంసించారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు ప్రోటిజెనిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం విశాఖలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి, యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రోటిజెనిక్స్ చేస్తున్న కృషి అభినందనీయం. ఆరోగ్య రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఇలాంటి సంస్థలే కీలకం" అని పేర్కొన్నారు. ప్లాస్మా ప్రోటీన్ థెరప్యూటిక్స్‌పై దృష్టి సారించిన

- మిగతా 2లో



## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

- ఉండవల్లి గుహల వద్ద 'యోగాంధ్ర' కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, యోగా గురు రాందేవ్
- చంద్రబాబును కర్మయోగి అంటూ కొనియాడిన రాందేవ్
- మోదీ లక్ష్యాలకు సీఎం సహకారం అద్భుతమన్న యోగా గురు
- ఆసక్తిగా యోగాసనాలను తిలకించిన ముఖ్యమంత్రి

- మిగతా 2లో

# రైతులకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం

## అన్నదాత సుఖీభవ: రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు

- చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్లలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు విడుదల
- తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7 వేల చొప్పున ఆర్థిక సాయం
- కడప, కర్నూలులో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన
- వ్యవసాయ స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్ల వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లను జమ చేశారు. ఈ సాయంతో ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7,000 జమ అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, అంతకుముందు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టు తయారీ, నూనె గింజల మిషన్ వంటి ప్రదర్శనల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎం కిసాన్ పథకంపై ప్రధాని మోదీ ప్రసంగించిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వీక్షించారు.ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కడప, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్లు 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

- అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్
- భార్య, తల్లి, వ్యాపారవేత్తగా ఆమె మా జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడిన సీఎం
- భువనేశ్వరి దయ, కరుణ ఎందరికో ఆదర్శమని ప్రశంస
- నీలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టమంటూ పోస్ట్

- మిగతా 2లో

## హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం - ఇరాన్



అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు

- మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల అప్పు.. విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

- ఆర్థికవేత్తలు, నిపుణులతో సంప్రదింపుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని శ్వేతపత్రంలో వెల్లడి
- 2031 నాటికి పని చేసే వయసు జనాభా తగ్గనుందని, ఇప్పుడే చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

- మిగతా 2లో



## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

- కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత
- రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చామన్న కుటుంబ సభ్యులు

- మిగతా 2లో



## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!



- ఇరాన్‌తో ఒప్పందం విషయంలో గందరగోళం
- అమెరికా తరహాలో పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదన్న వాన్స్
- అందుకే ఒప్పంద వివరాలు త్వరగా వెల్లడి కాలేదని వ్యాఖ్య
- ఒప్పందం కుదర్చడం తమ ఘనతగా చెప్పుకొంటున్న పాక్
- వాన్స్ వ్యాఖ్యలతో పాక్‌కు ఇబ్బందికర పరిస్థితి

- మిగతా 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను

- మిగతా 2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

- మిగతా 2లో




## జగన్ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? ఈ ప్రచారంలో నిజమెంత?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాంగ్రెస్ తో జత కడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మీడియా సమావేశంలో ఆయన చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలతో ఆయన కాంగ్రెస్ కు మరింత చేరువయ్యారని, బీజేపీకి దూరమవుతున్నారన్న కక్యాంపెయిన్ సోషల్ మీడియాలో నడుస్తుంది. అంతకు ముందు నుంచే ఈ ప్రచారం జరుగుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది. బెంగళూరులో తన నివాసంలో ఉంటున్న జగన్ డీకే శివకుమార్ తో భేటీ అయ్యారన్న వార్తలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**కర్ణాటక నుంచి...**

బీజేపీ పై దేశ వ్యాప్తంగా ఎదురవుతున్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని, అందుకే కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కకుండా చేయడం వెనక కూడా జగన్ ఉన్నారంటూ మరొక ప్రచారం కూడా జరిగింది. తాజాగా ఏపీలో తాము కాక్రోచ్ లుగా మారుతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీసుకుని ఆయనను హస్తం పార్టీకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో నిజానిజాలు పరిశీలిస్తే... జగన్ కాంగ్రెస్ తో జత కట్టడానికి అసలు ఇష్టపడరు. ఎందుకంటే 2012లో పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. అప్పటి నుంచి జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ తో కలవకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తూ తన పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకును సంపాదించుకున్నారు.

**ఏపీ రాజకీయాలకే...**

జగన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమవుతారు. ఆయన తెలంగాణ వైపు కూడా చూడరు. అలాంటింది రాష్ట్ర విభజనకు కారణమయిన కాంగ్రెస్ తో ఎందుకు జట్టు కడతారు? అన్న ప్రశ్నకు ప్రచారం చేసే వారి నుంచి సమాధానం ఉండదు. అందులోనూ వైసీపీ ఓటు బ్యాంకు అంతా కాంగ్రెస్ నుంచి వచ్చిందే. మళ్లీ కాంగ్రెస్ తో కలిస్తే తాను రెండు దశాబ్దాలుగా ఏర్పరచుకున్న ఓటు బ్యాంకును తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపే చేసే చర్యలకు అస్సలు దిగరన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. బీజేపీ ఇప్పుడు కేంద్రంలో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తుంది. జగన్ బీజేపీకి రహస్య మిత్రుడు. బలమైన బీజేపీని కాదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేంత రాంగ్ స్టెప్ ను రాజకీయంగా జగన్ వేయరన్నది కూడా అంతే వాస్తవం. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లోనూ ఒంటిరిగానే పోటీ చేస్తారు. ఒకవేళ ఎన్నికల అనంతరం పొత్తు ఇవ్వాల్సి వస్తే బీజేపీతో చేతులు కలుపుతారు కాని, తనను పధ్నాలుగు నెలల పాటు జైల్లో ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వరన్నది వాస్తవం.

## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- మొదటి పేజి తరువాయి

ఏపీలోని తొలి సంస్థ ఇదేనని ఆయన గుర్తుచేశారు. 2021లో ఎన్నారై వైద్యుల బృందం స్థాపించిన ఈ సంస్థ.. ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబులిన్ (×ఎ×+), హ్యూమన్ ఆల్బుమిన్, ఫ్యాక్టర్ ఎ××× వంటి కీలక ఉత్పత్తులను అభివృద్ధి చేస్తోంది. రోగనిరోధక లోపాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తస్రావ సమస్యల చికిత్సలో ఈ ఔషధాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రోటిజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకుని ఎన్నారైలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పల్లా కోరారు. విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, ప్రజల ఆరోగ్య భద్రతకు తోడ్పడే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక యోగి, కర్మ యోగి అని, ఆయనలా దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి పనిచేస్తే 'వికసిత్ భారత్' లక్ష్యం 2047 కంటే ముందే సాకారం అవుతుందని యోగా గురువు బాబా రాందేవ్ ప్రశంసించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద 'యోగాంధ్ర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు సైతం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, రాందేవ్ బాబా నిర్వహించిన యోగసాధనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. "సీఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు, కానీ నేను యోగా అతిథిగా వచ్చాను. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం స్ఫూర్తిదాయకం. చంద్రబాబు అభివృద్ధి, దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై కూడా రాందేవ్ బాబా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారింది. ఈ రాజధానిని పచ్చదనంతో, అద్భుతమైన అందాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం స్విట్జర్లాండ్‌ను తలపిస్తోంది" అని కితాబిచ్చారు. అంతకుముందు ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నానని, ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగా ప్రేమికుడు, సర్వజన ప్రేమికుడు అని అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో రాందేవ్ బాబా తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!

అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇస్లామాబాద్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. ఒప్పంద వివరాల విడుదల ఆలస్యంపై స్పందించిన ఆయన పాకిస్థాన్‌లో అమెరికా తరహా పత్రికా స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన వాన్స్ అమెరికాలో ఒప్పందాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే అంచనాలు ఉంటాయని చెప్పారు. కానీ పాకిస్థాన్, ఖతార్ వ్యవస్థల్లో అలాంటి సంప్రదాయం లేదని వ్యాఖ్యానించారు. అందుకే ఇరాన్‌తో ఒప్పంద వివరాలు విడుదల చేసే విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పాకిస్థాన్ 180 దేశాల్లో 153వ స్థానంలో ఉంది. అక్కడ జర్నలిస్టుల స్వేచ్ఛపై అంతర్జాతీయ సంస్థలు గతంలోనూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని తమ దౌత్య విజయంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం రద్దు కావడం కూడా పాకిస్థాన్‌కు ఇబ్బందిగా మారింది. చివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ డిజిటల్ పద్ధతిలో ఒప్పందంపై సంతకాలు చేశారు.

# రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు

హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

# రూ.10 లక్షల కోట్ల అప్పు..

## విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హార్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (×=+జ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు

తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అర్ధాంగి నారా భువనేశ్వరికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. భువనేశ్వరిని తన జీవితంలో వెలుగుగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.

"భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా మా అందరి జీవితాల్లో వెలుగు నింపే భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "నీ దయ, కరుణ, సానుకూల దృక్పథం ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. నీ ఔదార్యంతో ఇతరులను ఉన్నత స్థానంలో నిలబెడతావు. నువ్వు చేపట్టే ప్రతి పాత్రకు అందాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తావు" అని కొనియాడారు. "నీలాంటి అద్భుతమైన వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టం. నీ బలం, ఆప్యాయత, మరెన్నో విధాలుగా నువ్వు ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత..

## హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు.

గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజులుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. "ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎనెఅయిఖఅ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

యోగా గురు బాబా రాందేవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు ఒక కర్మయోగి అని అభివర్ణించారు. అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద శనివారం 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాందేవ్ యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు అందిస్తున్న సహకారం అమోఘమని కితాబిచ్చారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. అంతకుముందు పతంజలి యోగా గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో యోగాకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, యోగా అభిమానులు పాల్గొన్నారు.

# వికలాంగ విద్యార్థులకు ఉచిత పరికరాల పంపిణీ





బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, అనంతపురం, జూన్20: మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. మడకశిర నియోజకవర్గానికి చెందిన 27 మంది వికలాంగ విద్యార్థులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వాకర్లు, సెరిబ్రల్ పాల్సీ కుర్చీలు తదితర పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు (సత్యసాయి జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు సభ్యుడు) హాజరై, విద్యార్థులకు స్వయంగా పరికరాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులు విద్యా ప్రయాణంలో వెనుకబడకుండా సమాజంలో సమాన అవకాశాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ పరికరాలు వారి చదువులో, రోజువారీ జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలల కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర వక్కలిగ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, మాజీ కౌన్సిలర్ ఉమాశంకర్, పట్టణ అధ్యక్షుడు, మండల అధ్యక్షులు నాగరాజు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరై, అందజేసిన పరికరాలతో ఆనందం వ్యక్తం చేశారు. సమాజంలో వికలాంగుల పట్ల అవగాహన పెంచడం, వారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా సమానత్వం సాధ్యమవుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం మడకశిర పట్టణంలో ఒక సామాజిక స్పృహను కలిగించేలా నిలిచింది. వికలాంగ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింతగా జరగాలని ప్రజలు ఆకాంక్షించారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ







నాయుడుపేట, పెన్ పవర్, జూన్ 20 రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా తొలి విడత ఆర్థిక సహాయ విడుదల కార్యక్రమంలో డా.నెలవల విజయశ్రీ దొరవారిసత్రం ఎంపీడీవో కార్యాలయంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తొలి విడతలో ఒక్కో అర్హ రైతుకు రూ. 7,000 చొప్పున అందజేయబడుతుండగా, అందులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 5,000 కేంద్ర ప్రభుత్వం (పీఎం-కిసాన్) రూ. 2,000లిలి చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని 26,563 మంది అర్హ రైతుల ఖాతాల్లో మొత్తం రూ. 17.83 కోట్ల ఆర్థిక సహాయం జమ కానుందని తెలిపారు. ఈ పథకం రైతుల సాగు ఖర్చులకు ఎంతో ఊరటనిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వం సమిష్టిగా కృషి చేస్తున్నాయని,రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నెలవల సుబ్రహ్మణ్యం,

సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్,కురుగొండ పిఏసిఎస్ చైర్పర్సన్ డాక్టర్ దారా అంకయ్య,జిల్లా టిడిపి అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, దొరవారి సత్రం మండల టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు,ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు,నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# అధ్వానంగా నాయుడుపేట పట్టణ వీధి రోడ్లు

**చిరుజల్లులుకే వీధి రోడ్లపై జలపాతాలు**
**అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలవలు**
**తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు**
**పట్టించుకోని మున్సిపల్ అధికారులు**





నాయుడుపేట, పెన్ పవర్, జూన్ 20 సుమారు 15 కోట్ల రూపాయల వార్షిక ఆదాయం కలిగిన నాయుడుపేట మున్సిపాలిటీలో వీధి రోడ్లు,డ్రైనేజీ కాలవలు అస్తవ్యస్తంగా తయారయ్యారు. దీనితో స్థానిక ప్రజలతో పాటు వివిధ కార్యకలాపాలపై నాయుడుపేట పట్టణానికి వచ్చే వారు సైతం ఇబ్బందులను ఎదుర్కోక తప్పడం లేదు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీనికి తోడు చిరుజల్లులకే వీధి రోడ్లు జలపాతాల్లా మారుతున్నాయి. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే వీధి రోడ్లు చిరుజల్లులకే జలపాతాల్లా మారడంతో ఆయా మార్గాల్లో వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోలు బురద నీటిని ఎద జల్లుతూ స్థానికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. నాయుడుపేట మున్సిపాలిటీ లోని 6వ వార్డు అశోక్ నగర్ లో సబ్ రిజిస్టర్ కార్యాలయ వీధిలో సిమెంట్ రోడ్డు ఎత్తు పల్లాలుగా అస్తవ్యస్తంగా ఉంది. దీనికి తోడు ఏళ్ళ తరబడి డ్రైనేజీ కాలువ లేకపోవడంతో చిరుజల్లులకే అడుగులోతు నీరు నిలిచిపోతుంది. దీనితో స్థానికులతో పాటు నాయుడుపేట సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాయుడుపేట అంబేద్కర్ భవన్ లో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్థానికులు సబ్ రిజిస్టార్ కార్యాలయ వీధిలో డ్రైనేజీ కాలవలు ఏర్పాటు చేయడంతో పాటు సిమెంట్ రోడ్డును పునరుద్ధరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతోనైనా మున్సిపల్ అధికారులు తమ ప్రాంతంలో సిమెంటు రోడ్డు,డ్రైనేజీ కాలువలు నిర్మించి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# మలేరియా వ్యాధీ గురించి అవగాహన





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 20. మలేరియా మాసోత్సవాలలో భాగంగా ది. 19.6.26 న వవ్వేరు యుపిహెచ్ సీ ఇసకపాలెం1 సచివాలయం పరిధిలోని బికెజి కాలనిలో కీటక జనిత వ్యాధులలో భాగమైన మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పిశీచి. రాబోవు వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా చేపట్టవలసిన జాగ్రత్తలు గురించి వివరించటమైనది. మురుగు నీరు నిల్వలు లేకుండా చూసు
కోవాలి

అని అవగాహన ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేయటమైనది. ఫ్రై డే డ్రై డే పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వట మైనది. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్ యు ఓ నాగరాజు, హెచ్ వి పద్మ, ఏ ఎన్ ఎం సుభాషిణి, అంగన్వాడి సిబ్బంది మరియు ఆశా తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించిన ఎమ్మెల్యే డా.నెలవల విజయ శ్రీ



సూళ్లూరుపేట, పెన్ పవర్, జూన్ 20 సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం కళాశాలలో విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం లో భాగంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం నాణ్యత, మెనూ, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్వాయిపాడు జడ్పీ హైస్కూల్‌లో బాలల రక్షణ, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం




పెళ్లకూరు, పెన్ పవర్, జూన్ 20 పెళ్లకూరు మండల పరిధిలోని తల్వాయిపాడు జడ్పీ హైస్కూల్ లో విద్యార్థులకు బాలల రక్షణ, మహిళల భద్రత మరియు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, అత్యాచారాలు మరియు లైంగిక నేరాలు, లైంగిక వేధింపులు, పోష్ చట్టం, మానవ అక్రమ రవాణా , కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, అలాగే వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే 112 అత్యవసర సేవలు, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 మహిళల హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ఎలాంటి వేధింపులు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి , సూపర్వైజర్ , హెచ్ఎం, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బాలల రక్షణ, మహిళల భద్రత మరియు సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

# ఎన్‌సీసీ విద్యార్థులకు యోగా



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 20. బుచ్చిరెడ్డిపాలెంలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీసీ ఏఎన్ఓ దీప్తి పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వివరించారు. విద్యార్థులు నిత్య జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య మాట్లాడుతూ, యోగా అనేది ఆరోగ్యకరమైన జీవన విధానానికి మూలస్తంభమని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయించడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. యోగా అనేక రకాల ఆరోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు పాఠశాలలో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జూన్ 20 రెవెన్యూ డే



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 20. బుచ్చిరెడ్డిపాలెం తాసిల్దార్ కార్యాలయంలో జూన్ 20 రెవెన్యూ డే సందర్భంగా తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సీనియర్ ఎమ్మార్వో జై కుమార్ కు ఘనంగా సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్.కె అకరం జి గోవర్ధన్ కె జయసేలా వి ఆర్ ఏ జే ప్రకాష్ జి మూర్తి ఎస్.కె రజియా పాల్గొన్నారు

# రైతుల సంక్షేమానికి అగ్ర తాంబూలం





ఆత్మకూరు పెన్ పవర్ జూన్ 20. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం..రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పండుగ వాతావరణం లో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ తొలి విడత నిధుల విడుదల ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల ఖాతాల్లోకి రూ.7 వేల జమ చేశాం వ్యవసాయ రంగంలో వస్తున్న శాస్త్ర సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని మంత్రి పిలుపు రైతులందరూ అంతర్ పంటగా అగర్ వుడ్ వేయాలని సూచన రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సంక్షేమానికి అగ్రతాంబూలం వేస్తూ ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడడం లేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా ఆత్మకూరు మండలం వాసిలి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మంత్రి ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, పల్నాడు జిల్లా లింగంగుంట్ల నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125 కోట్లను జమ చేసిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, లింగంగుంట్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాలను ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక సవాళ్లు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు ప్రతి ఏడాది రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ రెండో ఏడాది తొలి విడత నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన లి"నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం"లికు నిదర్శనమని పేర్కొన్న మంత్రి, ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని మరింత బలపరుస్తూ రాబోయే మూడేళ్లలో సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విడతలో ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000 చొప్పున మొత్తం రూ.7,000 జమ అయ్యిందన్నారు. నెల్లూరు జిల్లాలో 1,77,545 మంది రైతులకు రూ.117.16 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 34,223 మంది రైతులకు రూ.22.84 కోట్ల లబ్ధి చేకూరిందని వెల్లడించారు.సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలి : మంత్రి ఆనం అంతర్ పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపు వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, వరిపై అధిక ఆధారపడకుండా ఉద్యానవన, వాణిజ్య పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. అంతర పంటల విధానాన్ని అవలంబించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. అగరు వుడ్ వంటి వాణిజ్య పంటలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ఈ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. మన భవిష్యత్ తరాలకు నాణ్యమైన ఆహారం అందించేలా, అందరికీ ఆరోగ్య భద్రత కలిగేలా రైతులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన మెగా చెక్కును మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

# ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

## సమాజానికి సేవ చేసే ఉత్తమ ఫార్మాసిస్టులుగా ఎదగాలి -- డాక్టర్ అవినాష్





గంగవరం, పెన్ పవర్, జూన్ 20: ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 2022–2026 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అవినాష్ గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వృత్తిపరమైన నైతిక విలువలు, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఆదర్శ కాలేజ్ నుంచి పట్టభద్రులవుతున్న విద్యార్థులు దేశానికి, సమాజానికి ఆదర్శవంతమైన ఫార్మాసిస్టులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంలో చూపిన కృషి అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.కళాశాల కార్యదర్శి డాక్టర్ నాగమణి మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జీవితంలో సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఉందని, కష్టపడినంత మేరకు అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు.డైరెక్టర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీతో సరిపెట్టుకోకుండా ఉన్నత విద్య, ప్రత్యేక నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు.డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్లకు, అలాగే అకాడమిక్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు అందజేసి సత్కరించారు. గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యాలను అందించిన ఆదర్శ కాలేజ్ యాజమాన్యానికి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ విజయానికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుజిని, కళాశాల కోఆర్డినేటర్ పి శ్రీనివాస్, కళాశాల యాజమాన్య సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవలు మరువలేనివి జిల్లా కలెక్టర్వినోద్ కుమార్.వి,





బాపట్ల:( పెన్ పవర్) జూన్ 20 బాపట్ల రెవెన్యూ దినోత్సవం నగరం మండలం బెల్లంవారిపాలెం గ్రామంలో జరిగింది. వేడుకలను ఉద్దేశించి గ్రామంలో ఏర్పాటుచేసిన కేక్ ను కలెక్టర్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రెవిన్యూలో సుదీర్ఘ సేవలందించిన వీఆర్ఏ బడే శాంతకుమార్ నెహ్రూ, కర్ర వెంకటేశ్వర్ల కు శాలువలు కప్పి కలెక్టర్ సన్మానించారు.విపత్తు, ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ ఉద్యోగులు అందించే సేవలు అభినందనీయం అని కలెక్టర్ చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలను ఎదుర్కొని ప్రజలకు మంచి సేవలు రెవెన్యూ ఉద్యోగులు అందించడం శుభపరిణామన్నారు.

పాలనాపరమైన సేవలు రెవెన్యూ ఉద్యోగులు సమర్థంగా నిర్వహిస్తున్నారని రేపల్లె ఆర్డిఓ శ్రీదేవి చెప్పారు. రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయమన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ, ప్రభుత్వ సేవలు అన్నింటిని ప్రజలకు అందించడంలో విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా తుపాను, వరదలు వంటి విపత్తు సమయాలలో ప్రజల ప్రాణాలను రక్షించడం, ఇతర సేవలు అందించడం రెవిన్యూ ఉద్యోగులకే సాధ్యమన్నారు. అన్నింటిలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖ పనితీరును ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. అందుకే ఇలాంటి రెవెన్యూ డే వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు.

ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని లక్ష్మి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, మంత్రి సహోదరుడు శివప్రసాద్, తహసిల్దార్, రెవెన్యూ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# 2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం





విజయవాడ, పెన్ పవర్, జూన్, 20, జూన్ 23, 2026 న రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రముఖ తెలుగు సినిమా నటులు డాక్టర్ గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్, మాగంటి మురళీ మోహన్.. ప్రతిష్టాత్మక పద్మ అవార్డులను స్వీకరించనున్నారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కళల విభాగంలో పద్మ శ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.

వీరిద్దరికి సంబంధించిన మరింత సమాచారం..

డాక్టర్ గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హాస్యానికి సరికొత్త అర్థాన్ని ఇస్తూ, దశాబ్దాలుగా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నటుడు డాక్టర్ గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్. సామాన్య ప్రజల పెదవులపై చిరునవ్వులు చిందించడమే ధ్యేయంగా సాగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.

ఆయన 1955 ఏప్రిల్ 15న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా, పటమట లంకలో ఒక నిబద్ధత కలిగిన పాఠశాల ఉపాధ్యాయుని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. మానవీయ విలువలు, క్రమశిక్షణ గల వాతావరణంలో పెరిగిన ఆయన, సెరామిక్ ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో డిగ్రీ పూర్తి చేశారు. ఇంజనీర్‌గా స్థిరమైన ఉద్యోగం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తన మనసుకు నచ్చిన కళారంగాన్ని ఎంచుకుని చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అక్కడ నటన, మైమ్ (మూకాభినయం) లలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 'గోల్డ్ మెడల్' సాధించారు. కేవలం గ్లామర్ కోసం కాకుండా, నిత్య జీవితంలో ఒత్తిడిని ఎదుర్కొనే సామాన్య ప్రజలకు థియేటర్‌లో పూర్తి వినోదాన్ని అందించి, వారు పెట్టే ప్రతి పైసాకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఆయన మొదటి నుంచే హాస్య పాత్రల వైపు అడుగులు వేశారు.

1977లో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన రాజేంద్ర ప్రసాద్ , నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో ఆరు భాషల్లో 286కు పైగా చిత్రాలలో నటించి మెప్పించారు. అంతర్జాతీయ సినిమాల్లోనూ నటించి తన ప్రతిభను చాటారు. కుటుంబ కథా చిత్రాలు, సామాజిక సందేశాత్మక సినిమాలు, అద్భుతమైన హాస్యభరిత పాత్రలతో ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. నటనతో పాటు మైమ్, మిమిక్రీ, హార్మోనియం మరియు సితార్ వాయించడం వంటి కళలలో ఆయన దిట్ట. అంతేకాకుండా, ఎన్నో సూపర్ హిట్ పాటలకు నేపథ్య గానం చేయడంతో పాటు సంగీత దర్శకత్వం కూడా వహించారు. పరిమిత బడ్జెట్ చిత్రాలు కూడా సమాజంపై ఎంతటి బలమైన ముద్ర వేయగలవో ఆయన నిరూపించారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 8 నంది అవార్డులు, ఒక జాతీయ పురస్కారం, కెనడా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రశంసలు దక్కాయి. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "నట కిరీటి" బిరుదును అందుకున్నారు. కేవలం 43 సంవత్సరాల పిన్న వయసులోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి "కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. అమెరికా, బ్రిటన్, ఆసియా, యూరప్ వంటి ప్రపంచ దేశాలలో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, ఎంతో మంది యువ ప్రతిభావంతులకు మార్గదర్శిగా నిలిచారు. 2015లో భారీ మెజారిటీతో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై పరిశ్రమకు సేవలందించారు.

సినిమా రంగంలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకపోయినప్పటికీ, కేవలం స్వయంకృషి, క్రమశిక్షణతో అగ్రస్థానానికి ఎదిగిన రాజేంద్ర ప్రసాద్, తన మధ్యతరగతి మూలాలను ఎన్నడూ మరువలేదు. సమాజం పట్ల బాధ్యతతో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలను గుప్తంగా నిర్వహిస్తున్నారు. పేద పిల్లల పాఠశాల ఫీజులు చెల్లించడం, అనాథ శరణాలయాలకు నిత్యావసర వస్తువులు అందించడం, లయన్స్ మరియు రోటరీ క్లబ్‌ల ద్వారా సేవలు చేయడం, మదర్ థెరిసా సేవా సంస్థలకు మద్దతు ఇవ్వడం వంటి పనులతో తన ఉదారతను చాటుకుంటున్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం యోగాను ప్రోత్సహిస్తూ, ఆడపిల్లల రక్షణ, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. తిరుమల యాత్రికుల కోసం ఆయన రాజేంద్ర ప్రసాదం" పేరుతో ఒక అతిథి గృహాన్ని విరాళంగా ఇచ్చారు. తన "నట కళా వేదిక" ద్వారా తెలుగు పద్య నాటకాలను ప్రోత్సహిస్తూ, రంగాస్థల కళాకారులను ఆదుకుంటున్నారు. అంతేకాకుండా, వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు ఎల్లప్పుడూ తక్షణ సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు.

చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరినీ తన నటనతో అలరిస్తూ, నిత్య జీవిత ఒత్తిడిని దూరం చేస్తున్న అరుదైన నటుడు రాజేంద్ర ప్రసాద్ . నేటి ఆధునిక, బిజీ లైఫ్‌లోనూ ఆయన సినిమా క్లిప్స్ ప్రేక్షకుల ముఖాల్లో ప్రశాంతమైన చిరునవ్వును, ఆనందాన్ని నింపుతూనే ఉన్నాయి.

మాగంటి మురళీ మోహన్ అనేక రంగాలలో తనదైన ముద్ర వేసిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రస్తుతం 85 సంవత్సరాల వయస్సులోనూ ఆయన ఎంతో చురుగ్గా సాగుతున్నారు. ఆయన 1940 జూన్ 24న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటుపల్లిలో జన్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొని, దేశం కోసం తమ కుటుంబ ఆస్తులను సైతం త్యాగం చేసిన దేశభక్తుల కుటుంబం నుంచి మురళీ మోహన్ వచ్చారు. ఏలూరులోని ప్రసిద్ధ సర్ సి.ఆర్.ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన, వ్యాపారంపై ఉన్న మక్కువతో తన చదువును మధ్యలోనే నిలిపివేశారు. రంగస్థలం కూడా ఆయనకున్న మరొక పెద్ద వ్యాపకం.

1973లో చలనచిత్ర పరిశ్రమలోకి ప్రవేశించిన మురళీ మోహన్ , ఇటీవల తన సినీ జీవితంలో స్వర్ణోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. ఆయన ఎన్నో గౌరవ పురస్కారాలను అందుకోవడమే కాకుండా 350కి పైగా చిత్రాలలో ప్రధాన పాత్రలలో నటించారు. ఆయన 'జయభేరి ఆర్ట్ ప్రొడక్షన్స్' సంస్థను స్థాపించి తెలుగు, కన్నడ భాషల్లో 25 చిత్రాలను నిర్మించారు. ఆయన అందుకున్న పురస్కారాలలో ఉత్తమ నటుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన ప్రతిష్టాత్మక నంది అవార్డు కూడా ఉంది. ఆయన నిర్మించిన చిత్రాలలో ఆరు సినిమాలు ఉత్తమ చిత్రంగా నంది అవార్డుతో సహా పలు అవార్డులను గెలుచుకున్నాయి. జయభేరి బ్యానర్‌లో వచ్చిన సినిమాలు ఆయన అభిరుచిని, విలువలతో కూడిన స్వచ్ఛమైన సినిమా కథలపై ఆయనకున్న నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

మురళీ మోహన్ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా, ఏపీ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లో 10 సంవత్సరాలకు పైగా ఆయన కీలక బాధ్యతలను నిర్వహించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాన్ని నిర్వహించడంలో ఆయన చేసిన కృషికి గానూ ఎంతో ప్రశంసలు లభించాయి. రంగాస్థల కళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డులను కేటాయించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2025లో ఆయన "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ" ఛైర్మన్‌గా వ్యవహరించారు. తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఆయన సినీ పరిశ్రమలోని తన సహచరుల మద్దతుతో సహాయక, నిధుల సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలిచారు. ఎంతో దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన కలిగిన ఆయన, హైదరాబాద్‌లోని పలు దేవాలయాల సముదాయమైన 'దైవ సన్నిధానం' సంస్థకు కార్యదర్శిగా మరియు అధ్యక్షుడిగా సేవలందించారు.

చిత్ర పరిశ్రమలో విజయవంతమైన ప్రస్థానం తర్వాత, మురళీ మోహన్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెట్టి 'జయభేరి ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను స్థాపించారు, ఇది అతి తక్కువ కాలంలోనే ప్రజల నమ్మకాన్ని చూరగొంది. ఆటోమొబైల్స్ రంగం కూడా కలిపి ఉన్న 'జయభేరి గ్రూప్'కు ఆయన నాయకత్వం వహిస్తున్నారు. ఈ సంస్థలు వేలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. సమాజానికి తిరిగి ఏదో ఒకటి ఇవ్వాలని ఆయన ఎల్లప్పుడూ నమ్ముతారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఆయన 'మురళీ మోహన్ చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు వైద్య శిబిరాలను నిర్వహించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా మరియు క్యాన్సర్ నివారణపై ఈ శిబిరాల్లో ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ట్రస్ట్ అంధుల పాఠశాలకు మరియు ప్రమాద బాధితులకు కూడా తన మద్దతును అందిస్తోంది. ఆయనకున్న ప్రజాదరణ మరియు సేవా కార్యక్రమాల కారణంగా, 2014లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నియోజకవర్గం నుండి పార్లమెంట్ సభ్యుడిగా (ఎంపీగా) ఎన్నికయ్యారు. 2015లో అత్యంత పవిత్రమైన గోదావరి పుష్కరాల నిర్వహణలో ఆయన పోషించిన పాత్ర ఎంతో ప్రశంసలు అందుకుంది. గొప్ప నిబద్ధతతో పనిచేసిన రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా ఆయన ప్రజల నుండి ఎంతో అభిమానాన్ని చూరగొన్నారు.

మురళీ మోహన్ తన చిత్రాలకు గానూ రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థల నుండి పలు గౌరవ పురస్కారాలను గెలుచుకున్నారు. కళారంగంలో మరియు సేవా ఆధారిత కార్యక్రమాలలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

# నగర ప్రజల భాగస్వామ్యంతోనే క్లీన్ గుంటూరు సాకారం కమిషనర్ కె. మయూర్ అశోక్






గుంటూరు, పెన్ పవర్, జూన్, 20, నగరం క్లీన్, గ్రీన్ గుంటూరుగామారాలంటే నగర ప్రజల విస్తృత భాగస్వామ్యం కీలకమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర (సాసా) కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కొనసాగింపులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిఎంసి ప్రధాన కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి, మార్కెట్ మెయిన్ రోడ్ స్వీపింగ్, విజ్ఞాన మందిరం దగ్గర కల్వర్ట్ ఫాగింగ్, డ్రైన్లలో టేమిఫాజ్ స్ప్రే, సిల్ట్ తొలగింపు, పబ్లిక్ టాయ్ లెట్స్ శుభ్రత పరిశీలన చేసి, విజ్ఞాన మందిరం ప్రాంగణంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం సాసా కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని, గత నాలుగు శనివారాల నుండి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల ఈసారి సాసా కార్యక్రమం మరింత ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా ప్రతి వారం ఒక థీమ్‌ను నిర్దేశించుకున్నామని, అందులో మొదటి వారంలో విజిబుల్ క్లీన్‌నెస్ మీద దృష్టి సారించగా, రెండవ వారంలో డ్రైన్ క్లీనింగ్, బల్క్ వేస్ట్ జనరేటర్స్ మరియు కొత్తగా వచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 పై ప్రత్యేకంగా దృష్టి సారించామని వివరించారు. ఒక క్యాంపెయిన్ మోడ్‌ను తీసుకొని చాలా చోట్ల విజిబుల్ క్లీన్‌నెస్, డ్రైన్ క్లీనింగ్‌లను పెద్ద ఎత్తున నిర్వహించామని, అలాగే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డ్రైన్లలో పూడికతీత పనులను కూడా చాలా వరకు పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. అయితే క్యాంపెయిన్ మోడ్‌లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు, ఆపరేషన్ లేదా మిషన్ ముగిసిన తర్వాత కూడా అదే స్ఫూర్తితో నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. "ఏదైనా ఒక పనిని చేసి అలాగే వదిలేయకూడదు; మనం సాధించిన విజిబుల్ క్లీన్‌నెస్‌ను ఇలాగే కంటిన్యూస్‌గా మైంటైన్ చేయాలి. ప్రతి ఒక్క చిన్న సందులో ఉండే డ్రైన్లను కూడా రెగ్యులర్‌గా క్లీన్ చేస్తూ ఉండాలి. పరిశుభ్రత అనేది అత్యంత ముఖ్యమైన అంశమని మనమందరం గుర్తుంచుకొని దీనిపై పని చేయాలి" అని పిలుపునిచ్చారు. శానిటేషన్ సూపర్‌వైజర్స్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్స్ మరియు మిగతా శానిటేషన్ సిబ్బంది అంతా తమ పరిధిలోని ప్రాంతాల పరిశుభ్రత తమ బాధ్యతగా భావించి పనిచేస్తే, తప్పకుండా గుంటూరు నగరాన్ని ఒక మంచి క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరుగా మార్చగలమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రయాణంలో శానిటేషన్ సిబ్బందితో పాటు ప్రజలు కూడా స్వయంస్ఫూర్తితో భాగస్వాములు కావాలని కోరారు. ఎన్‌జీఓలు, సివిల్ సొసైటీలు అందరూ కలిసి వస్తేనే ఈ పరిశుభ్రతను నిలబెట్టుకోగలమని, కాబట్టి ప్రతి వార్డ్ లో ఉండే యాక్టివ్ సిటిజన్స్ మరియు అసోసియేషన్లను కూడా భాగస్వాములు కావాల్సిందిగా స్థానిక అధికారులు, సిబ్బంది విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఎందుకంటే ప్రజల భాగస్వామ్యం ఉంటేనే క్లీన్‌నెస్‌ను నిర్వహణ చేయడం సాధ్యమవుతుందన్నారు. "మనం ఉదయాన్నే ఎంత శుభ్రం చేసినా, మళ్ళీ ఎవరైనా చెత్తను విసిరేస్తూ, లిటరింగ్ చేస్తూ ఉంటే ఆ శ్రమకు ఫలితం ఉండదు. కావున ప్రతి వార్డులో, ప్రతి వీధిలో, ప్రతి ప్రాంతంలో మనమంతా ప్రజలతో కలిసికట్టుగా పని చేయాలి" అని వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మన నగరానికి దేశంలోనే టాప్ ర్యాంక్ రావాలని ఆకాంక్షిస్తూ, కార్యక్రమానికి సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, ఉపా సెల్ పిఓ సింహాచలం మేనేజర్ బాలాజీ బాష, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాలను చంపినప్పుడు లేని కులం ఇప్పుడు ఎలా వచ్చింది రాచకొండ లక్ష్మయ్య



గుంటూరు, పెన్ పవర్, జూన్, 20, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాలు హత్య చేశారు ఇప్పుడు లేని కులం ఇప్పుడు ఎలా వచ్చింది, మాజీమంత్రి అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఒక కులాన్ని బయటకు లాకు అని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరిస్తూ వీడు చంపిన వాళ్ళకి అమ్మలు లేరా?వీడు మానభంగం చేసిన పాపకు అమ్మ లేదా వీడు దాడులు చేసిన వాళ్ళకి అమ్మ లేదా? అమర్నాథ్ గౌడ చంపినప్పుడు వాళ్లకి కులం లేదా? తోట చంద్రయ్యని చంపినప్పుడు వాళ్లకి కులం లేదా? డాక్టర్ సుధాకర్ ని చంపినప్పుడు కులం లేదా? కిరణ్ చంపినప్పుడు కులం లేదా? ఇలా ఎంతోమంది ఉన్నారు, వాళ్లందరికీ కులం లేదా? వాళ్లందరికీ కుటుంబాలు లేవా ? ఒక హాస్టల్ నుండి పాప మా తాత అని చెప్పి బయటకు వెళితే.. మైనర్ బాలిక మీద మానభంగం అన్నమే? వాడు చెరువులో పడి చస్తే. నిజమైన శిక్ష అని సంతోషించామే. మరి ఒక రౌడీ మీద. మీకెందుకు ఇంత ప్రేమ. ఒక రౌడీకి కులం అంటగట్టి సమర్థిస్తున్నారు అంటే?. ఆ కులాన్ని కించపరచు కుంటున్నారా? కులాన్ని బట్టి తప్పులు ఒప్పులుగా మారతాయా ఉత్తరప్రదేశ్లో ఎన్కౌంటర్ చేసే ఆహా ఓహో అనేది మీరే. మరెక్కడైనా ఎన్కౌంటర్ చేస్తే ఆహా ఓహో అనేది మీరే. రౌడీయిజాన్ని అంతం చేస్తున్నారు, అనేది మీరే రౌడీల మీద ఉక్కుపాదం మోపుతున్నారు, అనేది మీరే?, మీ అవసరాన్ని బట్టి.మీ కులాలను బట్టి.. మీ రాజకీయాన్ని బట్టి.. మీ వ్యవహార శైలి మారుతుందని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరించారు

# బ్రోకర్ బాబా.. నీ లీలలు ఏల...

**మట్టి కొట్టు... ధనం పట్టు... జేబు నింపుకో...**

**ఇదేనా నీ భూమి కోత ప్రవర్తన..**

**పచ్చని భూముల్లో చిచ్చు పెట్టటమే నా నీ దుస్వభావమా**

**నటనలో నవరసాలు... పేదల గుండెల్లో గుబేలు**

బాపట్ల:( పెన్ పవర్) జూన్20 బాపట్ల ఏమండో మనం సామాజిక మద్యామం లలో బురిడీ బాబా లను చూస్తున్నాం. కానీ లీలలు,నవరసాలు అనేవి మనం వారు ఇలా చేస్తారని తెలుసుకుంటున్నాం. కానీ ఇలాంటి స్వభావం గల బురిడీ బ్రోకర్ బాబా ని, నవరసాలు పండించే నట సర్వభౌముడిని మట్టి త్రవ్వకలలో ఒక వ్యక్తి ని మన ప్రాంతం లోనేచూస్తున్నాం. ఇతను మాత్రం మాట్లాడితే మాటలు కోటలు దాటుతాయి అంటారు కొందరు. కానీ ఆ మాటలు కేవలం ఊహాలకే పరిమితం అవుతాయి అనేది నిజం. నమ్మితే నమ్మకు ద్రోహం చేయటమే అతని లక్ష్యం అంటారు కొందరు. ఇప్పుడు అతని స్వభావం రైతన్నల పై పడింది అని సదరు బురిడీ బ్రోకర్ చేసే ఇప్పటి పనులలో తెలుస్తుంది. పచ్చని భూముల్లో చిచ్చు పెడుతూ, పొలాల్లో మట్టి త్రవ్వుతూ మట్టా సూరిడిగా అవతారం ఎత్తాడు. ఇది నవరసాలలో ఒక రసం మాత్రమే నండి. ఇంకో రసంలో తానే నాయకుడిని అని, ఉన్నత నాయకుడికి నమ్మిన బంటు అని,నేను చెప్పిందే వేదం అని ఎందరినో బురిడీ కొట్టిస్తూ బురిడీ బ్రోకర్ బాబా అయ్యాడు అంటే అతిశయోక్తి కాదు. ఇతని చేష్టలతో ఉన్న పార్టీ పరువు కూడా పోయే పరిస్థితి కి వచ్చింది అనేది కొందరు రాజకీయ ఉద్దండు ల వాదన. రైతన్న బ్రతకాలి అంటే భూమాత కి పూజలు చేసి మెట్టగా ఉన్న భూమిని పచ్చగా చేసి పంట ను పండిస్తారు. కానీ పేదలను, సమాజం పై అవగాహన లేని వారిని బురిడీ బాబా ఎంచుకొని పచ్చని భూములకు సదరు శ్రీనివాసుడు చిచ్చు పెడుతున్నాడు అనే సంఘటనలు చెప్పకనే చెబుతున్నవి. దీనికి ప్రధానం గా భూమాతను త్రవ్వి బయటి వారికి అమ్ముకుంటు తన జేబు నింపుకుంటు రైతన్న నోట్లో మట్టి కొడుతున్నాడు శ్రీనివాసుడు అని కొందరి మాటల్లో విన్నాం. ఇలా పంట భూములు చిత్తు చేస్తూ ఆ తోలకాలు తో రహదారులు కూడా ఛిద్రం అవుతున్నాయి అనేది జగమెరిగిన సత్యం. అంతే కాదు రహదారి వెంట ఉన్న ఇళ్లలోకి దుమ్ము, ధూళి తో ఎందరోఇక్కట్లకు గురి అవుతున్నారు.ఇలాంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలలోఇతని తో పాటు తన కుటుంబ సభ్యుడు ఒకరు ఉన్నారు అని కూడా ఎందరో చెబుతున్నారు. ఎవరు ఎన్ని రాసిన మా మట్టి తోలకం,జేబు నింపుకోవటం మేము ఆపం అంటూ నిరంతరం మట్టి తీస్తున్నారు. అదేం అంటే నేను రాజకీయాల్లో ఉన్నత పరిచయాలు అంటూ గొప్పలు చెబుతూ జేబులు నింపుకుంటున్నాడు అని కొందరు వాదన.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అలాంటి బురిడీ బ్రోకర్ బాబా ల నుండి రైతులను రక్షించి భూమాత ను కొల్లగొట్టకుండా చూడాలి అని,రహదారి వెంట ఇళ్లలో ఇక్కట్లు రాకుండా చర్యలు తీసుకోవాలి అని పర్యావరణ పరిరక్షణ ప్రియులు కూడా కోరుతున్నారు.

# వ్యర్థాల దహన యంత్రాన్ని ప్రారంభించిన కమిషనర్ బాపట్ల మునిసిపల్ కమిషనర్ హాసిని

బాపట్ల:( పెన్ పవర్) జూన్20 బాపట్ల పట్టణం బేతని కాలనీలో ఏర్పాటు చేసిన వ్యర్థాల దహన యంత్రమును ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ యంత్రాన్ని ప్రారంభించి దాని పనితీరును పరిశీలించి, సంబంధిత అధికారులకు కాలనీ వాసులకు నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతను మెరుగుపరచడం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణను ప్రోత్సహించడం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఈ వ్యర్థాల దహన యంత్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ యంత్రంలో అనుమతించబడిన పొడి వ్యర్థాలను అధిక ఉష్ణోగ్రత వద్ద సురక్షితంగా దహనం చేయడం ద్వారా వ్యర్థాల పరిమాణం గణనీయంగా తగ్గుతుందని, దుర్వాసన, దోమలు, ఈగలు మరియు వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చని వివరించారు.ప్రజలు తడి, పొడి వ్యర్థాలను తప్పనిసరిగా వేర్వేరుగా అందించాలని, పురపాలక సంఘం వారు సూచించిన వ్యర్థాలను మాత్రమే ఈ యంత్రంలో వేయాలని కోరారు. తడి చెత్త, గాజు, లోహ వస్తువులు, ప్రమాదకర వ్యర్థాలు మరియు పేలుడు పదార్థాలను ఈ యంత్రంలో వేయరాదని తెలిపారు. ప్రజల సహకారంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన బాపట్లను నిర్మించగలమని పేర్కొన్నారు.అనంతరం కమిషనర్ కాలనీలోని పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు.అలాగే స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, పారిశుధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం మెడికల్ కిట్లు పంపిణీ చేసారు.ఈ



కార్యక్రమంలో డి.ఈ కృష్ణారెడ్డి,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మందపాటి ఆంద్రెయ,కాలనీ అడ్మినిస్ట్రేటర్ జావేద్ బాష ,శానిటరీ ఇన్స్పెక్టర్ కరుణ ,కాలనీ ప్రెసిడెంట్ నటరాజ్ , పురపాలక సంఘ సిబ్బంది ,ప్రజాప్రతినిధులు మరియు బేతాని కాలనీ ప్రజలు పాల్గొన్నారు.....

# గణపవరంలో ఘనంగా "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమం





కర్లపాలెం:( పెన్ పవర్) జూన్20 బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధిలోని గణపవరం గ్రామంలో "స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, బాపట్ల శాసనసభ్యులు వేగేసేన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భారతదేశంలోనే ఏకైక ప్లాటినం సర్టిఫైడ్ ఇసిఎమ్ఓ కేంద్రంగా నిలిచిన హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్




గుంటూరు, పెన్ పవర్,జూన్ 20, హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ విభాగం వైద్య రంగంలో సరికొత్త అంతర్జాతీయ మైలురాయిని అధిగమించింది. వైద్య ప్రమాణాల్లో అత్యున్నత గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ (ఇఎల్ఎస్ఓ) నుండి అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డును ఈ ఆసుపత్రి కైవసం చేసుకుంది. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా భారతదేశంలోనే ఏకైక ప్లాటినం-సర్టిఫైడ్ ఇసిఎమ్ఓ కేంద్రంగా యశోద హాస్పిటల్స్ నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత స్థాయి అత్యవసర ప్రాణ రక్షణ సేవలను అందించే పరిమిత ఉన్నత కేంద్రాల సరసన ఇది స్థానం సంపాదించుకోవడం గమనార్హం. ఈ విశిష్ట ఘనతపై క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ ప్లాటినం గుర్తింపు రోగుల భద్రత, క్లినికల్ ఎక్సలెన్స్ మరియు అంతర్జాతీయ ప్రమాణాలకు తాము కనబరుస్తున్న నిరంతర నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆధునిక వైద్యంలో అత్యంత సంక్లిష్టమైన లైఫ్-సపోర్ట్ థెరపీలలో ఇసిఎమ్ఓ ఒకటని, ఈ గౌరవం తమ చికిత్సా విధానాలు, విజయవంతమైన ఫలితాలు, మల్టీడిసిప్లినరీ టీమ్‌వర్క్ మరియు నిరంతర శిక్షణ యొక్క బలాన్ని స్పష్టం చేస్తోందని వివరించారు. ఈ ప్లాటినం-సర్టిఫైడ్ కేంద్రం ద్వారా విఎ, వివి, ఇసిపిఆర్, అవేక్ ఇసిఎమ్ఓ మరియు కాంప్లెక్స్ మల్టీ-ఆర్గాన్ సపోర్ట్‌తో కూడిన సమగ్ర సేవలను అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్ట్‌లు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, పెర్ఫ్యూషనిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్లు మరియు ప్రత్యేక ఐసియు నర్సుల బృందం అందిస్తోంది. అత్యాధునిక ఐసియు కేర్, ప్రపంచ స్థాయి అవయవ మార్పిడి మరియు ఎయిర్ అంబులెన్స్ సేవల సమగ్ర సమ్మేళనంతో ఈ సంస్థ తీవ్ర ఆరోగ్య సమస్యలు కలిగిన రోగులకు సంజీవనిలా మారుతోంది. ఇక్కడ 24 గంటల అంతర్జాతీయ ప్రోటోకాల్స్ అనుసరించే క్రిటికల్ కేర్ యూనిట్లు, పటిష్టమైన ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు మరియు ఎముక మజ్జ మార్పిడి వంటి క్లిష్టమైన సేవలలో ప్రపంచ ప్రసిద్ధ కేంద్రాలతో సమానమైన విజయవంతమైన ఫలితాలు ఇక్కడ నమోదవుతున్నాయి. ముఖ్యంగా, ఎండ్-స్టేజ్ కార్డియాక్ లేదా రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్న రోగుల ప్రాణాలను రక్షించడంలో ఇసిఎమ్ఓ ఒక బలమైన వారధిగా పనిచేస్తోంది. వైద్య రంగంలో సరికొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడంపై డాక్టర్ వెంకట్ రామన్ కోలా మరియు డాక్టర్ మాధవ్ రెడ్డి స్పందిస్తూ, అంతర్జాతీయ స్థాయి ఇసిఎమ్ఓ విశిష్టతను, అత్యాధునిక ఎయిర్ అంబులెన్స్ సేవల సహాయంతో దేశవ్యాప్తంగా మరియు అంతర్జాతీయంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను వేగంగా, సురక్షితంగా తరలించి అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్నామని తెలిపారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితులలో ఉన్న రోగులకు సకాలంలో, కరుణతో కూడిన అంతర్జాతీయ స్థాయి సంరక్షణ అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ (టీమ్ లీడర్), ఖాసిం వలి (మార్కెటింగ్) పాల్గొన్నారు. యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ మరియు ట్రాన్స్‌ప్లాంట్ మెడిసిన్ విభాగంలో తన అగ్రగామి పాత్రను నిరంతరం నిలబెట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్ రమణ కోలా ( మెడికల్ డైరెక్టర్ ఫర్ యశోద హాస్పిటల్స్) డాక్టర్ మాధవ రెడ్డి (క్రిటికల్ కేర్ కన్సల్టెంట్,) కే చంద్ర శేఖర్ (మార్కెటింగ్ టీం లీడర్ ) తదితరులు పాల్గొన్నారు.

# తోటి కానిస్టేబుల్ కుటుంబానికి '2009 బ్యాచ్' కానిస్టేబుళ్ల అండ

**బాధిత కుటుంబానికి రూ.1,75,000/- ఆర్థిక సాయాన్ని అందజేసిన బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్.**

**పోలీస్ కుటుంబాలకు అండగా ఉండేందుకు ఎల్లప్పుడూ సిద్ధం**

బాపట్ల:( పెన్ పవర్): జూన్20 బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక కుటుంబంలా మెలుగుతూ.. ఒకరికి ఒకరు సాయాన్ని అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. కారంచేడు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ పవన్ కుమార్ కుటుంబానికి ఆయన తోటి బ్యాచ్ మిత్రులు మానవత్వంతో అండగా నిలిచారు. అకస్మాత్తుగా ఇంటి యజమానిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకు 2009 బ్యాచ్ కానిస్టేబుళ్లు అందరూ కలిసి తమ వంతుగా రూ.1,75,000/ - నగదును సేకరించారు. ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన కానిస్టేబుల్ యొక్క కుటుంబ సభ్యులను ఎంతో ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తామున్నామనే ధైర్యాన్ని ఇస్తూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి తోడుగా ఉంటుందని భరోసాను కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అనారోగ్యంతో మరణించిన తోటి కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకోవడానికి 2009 బ్యాచ్ సిబ్బంది అంతా ఒక తాటిపైకి వచ్చి, చొరవ తీసుకుని ఆర్థిక సహాయం అందించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని పోలీస్ శాఖలోని సిబ్బంది అందరూ నిరంతరం కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. తోటి పోలీస్ సిబ్బందికి ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా అది తమ సొంత సమస్యగా భావించి వారికి సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

మొత్తం బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక కుటుంబం వలె ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన కుటుంబంలోని సిబ్బందికి ఏ చిన్న కష్టం వచ్చినా వారికి అండగా ఉండేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించే కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను కోల్పోవడం పోలీస్ శాఖకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారికి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా తనను కలిసి చెప్పవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మరణానంతరం రావలసిన బెనిఫిట్స్ ను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు, మరణించిన కానిస్టేబుల్ తోటి 2009 బ్యాచ్ మిత్రులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అన్యాయంగా కేసులో ఇరికించిన మాజీ సైనికుడికి న్యాయం చేయకపోతే మాజీ సైనికులు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం : రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు

బాపట్ల:( పెన్ పవర్) బాపట్లలో మాజీ సైనికుడు కృపారావు పై పెట్టిన అక్రమ కేసు విషయమై రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఈరోజు గుంటూరు ఆరండల్ పేట లోని ఎక్సైజ్ స్టేషన్ ను సందర్శించి సంబంధిత కేసు విషయమై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, గుంటూరు జిల్లా చినకాకానికి చెందిన మాజీ సైనికుడు కృపారావు మరో జూనియర్ కమిషన్డ్ అధికారితో కలిసి ఆర్మీ క్యాంటీన్ నుండి తమకు మాజీ సైనికులు గా హక్కు కలిగిన మద్యాన్ని తీసుకొచ్చే క్రమంలో గుంటూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్ లో దురుద్దేశ పూర్వకంగా మాజీ సైనికుడు కృపారావు ను పట్టుకొని బాధ్యతారాహిత్యంగా ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కానిస్టేబుల్ అరెస్ట్ చేయడమే కాకుండా, పరుష పదజాలలు వాడుతూ దురుసుగా ప్రవర్తించటం హేమనైన చర్య అని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలియ జేశారు. అత్యుత్సాహంతో అనధికారికంగా పట్టుకున్న వ్యక్తి మాజీ సైనికుడు అని తెలిసినా, ఒక సామాన్య సివిలియన్ గా కేసు నమోదు చేయటం విడ్డూరం అని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. అంతే కాకుండా సదరు మాజీ సైనికుల దగ్గర అధికారికంగా ఉన్న 18 సీసాల మద్యాన్ని కేవలం 12 సీసాల మద్యం గా చిత్రీకరిస్తూ గుంటూరు ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారు అధికారికంగా కేసు నమోదు చేయటం హాస్యాస్పదమే కాకుండా పాలక ప్రభుత్వ లోపంగా కూడా పరిగణిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలియ జేశారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన పటిష్టమైన భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి శాఖకు చెందిన ఉద్యోగి నడుచుకోవలసిన భారత దేశంలో ఇలా కేసును తారుమారు చేస్తూ స్వార్థ పూరితంగా సమాజాన్ని తప్పు దోవ పట్టించే విదంగా తప్పుడు కేసులు బనాయించే అధికారులపై తగు ఖటిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు



తాండ్ర సాంబశివరావు ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తల దించుకునే విదంగా తప్పుడు కేసులు బానాయించిన అధికారులపై చర్యలు తీసుకొని అన్యాయంగా కేసులో ఇరికించిన మాజీ సైనికునికి న్యాయం చేయకపోతే లాకప్ డెత్ విషయాలలో కూడా ప్రజలు అనుమానించాల్సిన పరిస్థితి వస్తుంది అని ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారిని హెచ్చరించారు. రాష్ట్రంలో విచ్చల విడిగా సాగుతున్న బెల్ట్ షాపులను మరియు కాపుసారాను నియంత్రించి నిర్దేశించిన ధరలకే క్వాలిటీ మధ్యాన్నీ అందించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా తమ గొప్పలు చెప్పుకోవటానికి ఇలా మాజీ సైనికుల పై అక్రమ కేసులు బానాయించటాన్ని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తీవ్రంగా ఖంచించారు. అంతిమంగా రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ, మాజీ సైనికుడు కృపారావు విషయంలో ఉన్నతాధికారులు కలుగ జేసుకుని న్యాయం చేయకపోతే మాజీ సైనికులు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధ గా ఉంటారు అని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలియ జేశారు.

# బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

బాపట్ల:( పెన్ పవర్) జూన్20 బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్, ఎన్సీసీ విభాగాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం,ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. వేడుకలలో భాగంగా జూన్ 18న అంతర్జాతీయ యోగా దినోత్సవం అంశంపై టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని యోగా చరిత్ర, ప్రాముఖ్యత మరియు శాస్త్రీయ ప్రయోజనాలపై తమ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. జూన్ 19న యోగా ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు యోగా సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని కల్పించారు. అలాగే యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను (పాంప్లెట్లను) ప్రజలకు పంపిణీ చేశారు. జూన్ 20న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలు, ప్రాణాయామం మరియు ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని నిపుణులు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. హిమ బిందు, వైస్ ప్రిన్సిపాల్ ఐ. హరిత, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతులు డాక్టర్ కె. కృష్ణకుమారి, జి. కల్యాణి, ఎన్సీసీ అధికారులు పి. నవభాను, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన







నిర్వాహకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

# ఘనంగా 'యోగ దినోత్సవం' మరియు 'ఫాదర్స్ డే' వేడుకలు

బాపట్ల:( పెన్ పవర్) జూన్20 బాపట్ల స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో 'అంతర్జాతీయ యోగ దినోత్సవం' మరియు 'ఫాదర్స్ డే' (పితృ దినోత్సవం) వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల బ్రాంచ్ ప్రిన్సిపల్ భాగ్య రాణి బెల్లంకొండరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవనంలో మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగాను అలవరచుకోవడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని తెలిపారు. అలాగే, పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్ర వెలకట్టలేనిదని, క్రమశిక్షణతో కూడిన మార్గదర్శకత్వాన్ని అందించే నాన్నకు కృతజ్ఞతగా ఈ 'ఫాదర్స్ డే' వేడుకను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

వేడుకల విశేషాలు:

యోగాసనాల ప్రదర్శన: విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సిబ్బంది కలిసి ఉదయం ప్రత్యేక యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. తండ్రీ-పిల్లల అనుబంధం: ఫాదర్స్ డే సందర్భంగా విద్యార్థులు తమ తండ్రులతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో మరియు సరదా ఆటల్లో పాల్గొని సందడి చేశారు. పిల్లలు తమ తండ్రులపై ఉన్న ప్రేమను వ్యక్తపరుస్తూ ప్రత్యేక గ్రీటింగ్ కార్డ్స్ అందించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు సహ-సిబ్బందికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.






# అన్నదాత సుఖీభవ చెక్కు ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందబాబు.





వేమూరు( భట్టిప్రోలు పెన్ పవర్ (జూన్20) రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నక్క ఆనందబాబు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ 2026- 27 మొదట విడత పంపిణీ కార్యక్రమం శనివారం వేమూరులో మండల పరిషత్ కార్యాలయంలోని రోశయ్య మీటింగ్ హాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆయామంలో రైతులకు అరకురా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని అదే కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు గుర్తు చేశారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు, అందించిన ఘనతముఖ్యమంత్రి చంద్రబాబుదే నని అన్నారు. సాగునీటి సంఘాల ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించే విధంగా పనిచేస్తున్నామని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో రైతులకు సాగునీరు అందక అనేక ఇక్కట్లు గురయ్యారని కలవల మరమ్మతులకు వచ్చిన డబ్బులు దోచుకున్నారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల మంది రైతులకు పైగా మూడువేల 125 కోట్లు అందించడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆనందబాబు గుర్తు చేశారు.

.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, ఏడిఏ అక్తర్ హుస్సేన్, పార్టీ నాయకులు విజయ్ బాబు, గాజుల వెంకటసుబ్బయ్య, మురళీకృష్ణ, ఏఎంసి వైస్ చైర్మన్ ఆమ్మిశెట్టి కిషోర్, శివారెడ్డి, గోపాలాం సుబ్బారావు, పెరవలి సొసైటీ అధ్యక్షులు ఉక్కుర్తి నాగయ్య, మన్నే పసి, షేక్ అనీఫ్, వేల్పుల రవిప్రసాద్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇది రెండేళ్ల నమ్మకం కాదు వెన్నుపోటుకు రెండేళ్లు

## ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం వివరించగలదా.?

కర్లపాలెం:( పెన్ పవర్) జూన్20 బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం అనే కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా నిర్వహించారు ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి తప్ప సామాన్యులకు ఒరిగింది ఏమీ లేదని కర్లపాలెం మండల వైసీపీ కన్వీనర్ యల్లావల ఏడుకొండల ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో వారి ఇంటికి చేకూరిన లబ్ధిని ఒక కరపత్రం రూపంలో వారింటికే స్థానిక ఎమ్మెల్యేలు వెళ్లి మీ ఇంటికి ఆయా పథకాల ద్వారా ఇంత లబ్ధి చేకూరిందని సవివరంగా వివరించారు. ఎక్కడో జిల్లా కేంద్రంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి అందరినీ అక్కడికి పిలిపించుకొని ప్రస్తుత ప్రభుత్వం గొప్పగా పరిపాలిస్తుందని బడాయి చెప్పుకోవడం తప్ప ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చారా అని ఆయన నిలదీశారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేలను ఇంటింటికి పంపించి ఆ కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి జరిగిందో వివరించగలరా అని ఏడుకొండలు



సూటిగా ప్రశ్నించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత నగదు వచ్చింది అని ఒక పుస్తక రూపంలో వివరించారు. ఇది రాష్ట్రమంతా కూడా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కూడా ఇదేవిధంగా ప్రతి ఇంటికి ఎమ్మెల్యేలను పంపించి ఆ కుటుంబానికి జరిగిన మేలును వివరించగలరా అని సవాలు విసిరారు? అమలు చేయలేని హామీలను ఇచ్చి హామీలు నెరవేర్చలేక ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ, వాలంటరీ వ్యవస్థను నడుపుతూ జీతాలు రెట్టింపు చేస్తాం, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచము, కరెంటు చార్జీలు పెంచము, నిత్యవసర ధరలు తగ్గిస్తామని, అర్హులైన పేదలకు మూడు సెంట్లలో ఇళ్ల స్థలాలు వంటి అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత ప్రజలకు వెన్నుపోటు పొడిచి మోసం చేశారు గనకే ఇది రెండేళ్ల నమ్మకం కాదు వెన్నుపోటుకు రెండేళ్లు అని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# భట్టిప్రోలులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

భట్టిప్రోలు, పెన్ పవర్ (జూన్20) సింగల్ యూస్ ప్లాస్టిక్ ను వాడటాన్ని నిరోధిస్తే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని భట్టిప్రోలు మండల అభివృద్ధి అధికారిణి ఎస్ వెంకటరమణ పేర్కొన్నారు. నెలలో ప్రతి మూడవ శనివారం నిర్వహింప తలపెట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి ఈ సందర్భంగా కొనసాగిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగానంతరం వాటిని బహిరంగ ప్రదేశాలలో పడవేయటం వలన అవి పర్యావరణ కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. కనుక ఆ ప్లాస్టిక్ ను వినియోగించతానికి ప్రజలు స్వస్తి చెప్పాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వర్షపు నీరు నిల్వచేరకుండా ప్రజలు తగులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు స్థానిక సంస్థల అధికారులు కూడా ఎప్పటికప్పుడు గ్రామాలలో పర్యటిస్తూ నీరు నిలవ లేకుండా



చూడాలన్నారు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ జి. నాగరాజు,ఏపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్ర రావు, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య రేవతి, సి సి దాసరి హనోకు, మరియు యానిమేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే గళ్ళ మాధవి

గుంటూరు, పెన్ పవర్, జూన్, 20, ఈరోజు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజక జాతి ముద్దుబిడ్డ కంచర్ల శ్రీనివాసు రావు గారు చనిపోయిన సందర్భంగా వారికి కుటుంబానికి అండగా నిలిచిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి గారి ఆధ్వర్యంలో ఈరోజు పి ఎస్ ఆర్ ఇన్ఫ్రా రియల్ ఎస్టేట్ వ్యాపారి బి శ్రీనివాసరావు గారు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న 43వ డివిజన్ కార్పొరేటర్ కొమ్మునేని

కోటేశ్వరరావు 44వ డివిజన్ ప్రెసిడెంట్ గద్దం భద్రయ్య 45వ డివిజన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు జిల్లా కార్యనిర్క కార్యదర్శి సంజీవరావు జిల్లా అధికార ప్రతినిధి రాచకొండ



లక్ష్మయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు

# కొడవలూరు మండలం వైసీపీ బి ఎల్ ఏ లతో, నాయకులతో మాజీ మంత్రులు కాకాణి, నల్లపరెడ్డి సమీక్ష సమావేశం.





నెల్లూరు రూరల్ (కొడవలూరు) పెన్ పవర్,జూన్ 20శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెం లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొడవలూరు మండలం వైసీపీ బి ఎల్ ఏ లతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో. మాజీ మంత్రి వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర పి ఏ సి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ పేరుతో ప్రారంభమైన ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పోలింగ్ బూత్ పరిధిలో బూత్ లెవెల్ ఆఫీసర్ బి ఎల్ ఓ తో పాటు పర్యటించే తెలుగుదేశం బూత్ లెవెల్ ఏజెంట్స్ బి ఎల్ ఏ లు తెలుగుదేశం పార్టీ రూపొందించిన ఒక యాప్ సాయంతో ఓటర్ల వ్యక్తిగత వివరాలు సేకరిస్తూ వైఎస్ఆర్సిపి సానుభూతిపరులు అనుకున్నవారి ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని పలుచోట్ల గుర్తించడం జరిగింది. కావున వైస్సార్సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు బి ఎల్ ఏ అప్రమత్తతతో వ్యవహరిస్తూ అటువంటి చర్యలు గుర్తించినట్లయితే వెంటనే నియోజకవర్గ పార్టీ లీగల్ ప్రెసిడెంట్ / వార్ రూమ్ లీగల్ ప్రతినిధి ద్వారా నియోజకవర్గ ఈ ఆర్ ఓ కి ఫిర్యాదు చేయవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో

ఏ పి ఎల్ డి ఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ నెల్లూరు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి కోవూరు నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు నియోజకవర్గ బూత్ కన్వీనర్ల ఇంచార్జ్ కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి ఐదు మండలాల కన్వీనర్లు, కౌన్సిలర్లు, వైసీపీ సీనియర్ నాయకులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు

# డీఎస్సీ డ్యామేజ్ ఎవరికి...

**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:** డీఎస్సీ 2025 విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి షాక్ తప్పలేదు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలు అనేక రకాల అవకతవకలు జరిగాయని గత కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి అయితే తన పక్కన డీఎస్సీ అభ్యర్థులను పెట్టుకుని మరి ఆరోపణలు చేస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో అనుకున్న స్థాయిలో వైసీపీకి ప్రజల్లో మైలేజ్ దక్కలేదు. అలా దక్కలేదు సరి కదా తిరిగి డ్యామేజ్ జరిగింది. దానికి కారణం లేకపోలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు మాదిరిగా కూటమి నుంచి ఎదురుదాడి రాలేదు. ఒక పద్ధతి ప్రకారం అధికారులు మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణలు ఇచ్చారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నం గా ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. అందుకే లైట్ తీసుకుంటున్నారు. మరికొందరైతే అసహ్యించుకుంటున్నారు వైసీపీ తీరుపై. ఎప్పటికప్పుడు స్టాండ్ మార్చుతూ.. డీఎస్సీ విషయంలో వైసిపి ఒక స్టాండ్ తో ముందుకు వెళ్లలేదు. రకరకాల ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆరోపణలకు కూటమి నేతలు కౌంటర్ ఇచ్చి ఉంటే అది రాజకీయ రగడగా మారి ఉండేది. అందుకే ప్రభుత్వం వ్యూహాత్మకంగా విద్యాశాఖ ఉన్నతాధికారులను రంగంలోకి దించింది. సాక్షి మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలను కేస్ స్టడీస్ గా తీసుకుంటూ ఒక్కో అనుమానాన్ని నివృత్తి చేశారు. ఎంతో ఓపికగా అధికారులు సమాధానాలు చెప్పారు. దీంతో ఆదిలోనే దానికి కౌంటర్ ఇవ్వగలిగారు అధికారులు. సోషల్ మీడియాలో అధికారులు ఇచ్చే కౌంటర్ ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. లోకేష్ సవాల్ తో.. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద ఆధారాలు ఉంటే కచ్చితంగా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చు అని ప్రభుత్వ వర్గాలు సలహా ఇచ్చాయి. అది కూడా ప్రజల్లోకి వెళ్ళింది. వైసీపీ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు అంటూ ప్రజలు ఒక నిర్ధారణకు కూడా వచ్చారు. అక్కడితో ఆగలేదు. మళ్లీ కమ్మ డీఎస్సీ అంటూ చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో కమ్మ సామాజిక వర్గం వారికి అధిక అవకాశాలు కల్పించారు అంటూ ఆరోపణలు చేశారు. దానిని కూడా నివృత్తి చేసింది విద్యాశాఖ. రెడ్డి సామాజిక వర్గానికి 10 పోస్టులు, కాపు సామాజిక వర్గానికి 16 పోస్టులు ఇస్తే కమ్మ సామాజిక వర్గానికి మాత్రం 9 పోస్టులు కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఆ విషయంలో కూడా ఆ పార్టీకి షాక్ తప్పలేదు. చివరిగా లోకేష్ సాహసించి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు చర్యలను తప్పుపడుతూ.. అవసరం అనుకుంటే జగన్మోహన్ రెడ్డి తనతో చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. దానికి సై అనలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. లక్ష్మీపార్వతి తో పాటు యాంకర్ శ్యామల లాంటి వారిని పంపించారు. మరోసారి డీఎస్సీ విషయంలో చతికిల పడ్డారు. ఈ మొత్తం పరిణామాలతో ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారు. డీఎస్సీ విషయంలో వైసిపి కుట్ర చేస్తుంది అనే అనుమానాలను ఎక్కువమంది నమ్మారు. అంతిమంగా ఇప్పుడు ఈ డీఎస్సీ అంశం అనేది వైసీపీకి ఎక్కువగా డ్యామేజ్ చేస్తోంది. ముమ్ముందు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఆర్థిక ప్రగతిపై లోకేష్ కొత్త రోడ్‌మ్యాప్

**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:** ఏపీలోని టీడీపీ కూటమిలో యువ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జాతీయ స్థాయిలో తన పలుకుబడిని మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ మంత్రిగా ఆయన కేవలం రాష్ట్రానికే పరిమితం కావడం లేదు. అదే సమయంలో ఢిల్లీకి అనేక సార్లు వెళ్ళి వస్తున్నారు. కేంద్ర మంత్రులను విరివిగా కలుస్తున్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా సమావేశం అవుతున్నారు. తాను చురుకైన యువ నేతగా ఏపీ రాజకీయాల్లో ఉన్నాను అని తెలియచేసేందుకు ఈ పర్యటనలు లోకేష్ కి ఎంతగానో దోహదపడుతున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి.కేవలం దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే లోకేష్ పర్యటనలు పరిమితం కావడం లేదు, ఆయన వివిధ రాష్ట్రాలలో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాల మీదనే ఈ పర్యటనలు అని ప్రచారం జరుగుతున్నా వాటితో పాటుగా స్వామి కార్యం అన్నట్లు లోకేష్ ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న నాయకులను ముఖ్యమంత్రులను కలుసుకుంటూ వారితే మమేకం అవుతూ యంగ్ డైనమిక్ లీడర్ గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇదిలా ఉంటే నారా లోకేష్ తాజాగా పశ్చిమ బెంగాల్ కి వెళ్ళారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారితో కోల్ కతాలో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు రెండు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నారు. ఏపీలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి లోకేష్ సువెందుకు తెలిపారు. ఏపీలో అత్యధిక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కూడా చెప్పారు. శిపశ్చిమ బెంగాల్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని సువేందుని లోకేష్ కోరడం విశేషం. ఇదే సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సువేందుకు లోకేష్ విన్నవించారు.ఇంతకు ముందు ముంబై పర్యటనకు వెళ్ళిన నారా లోకేష్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తో కూడా భేటీ అయి అనేక అంశాలను ముచ్చటించారు. ఇలా లోకేష్ బీజేపీలో కీలకమైన రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ముఖ్యమంత్రులతో భేటీలు వేయడం రాజకీయంగా ఆసక్తిని కలిగించే అంశంగానే చూస్తున్నారు ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కావడం విశేషం. ఇక ఏపీ నుంచి రాజకీయంగా ఎదుగుతున్న నేతగా లోకేష్ ఉన్నారు. దాంతో ఆయన జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ పెద్దలతో పాటు యువ ముఖ్యమంత్రులతోనూ అదే రకమైన సాన్నిహిత్యం నెరపడం వెనక ముందు చూపు ఉందని అంటున్నారు. రానున్న రోజులలో ఆయన ఇదే తీరులో మరెంత మంది ముఖ్యమంత్రులను కీలక నేతలను కలుస్తారు అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఏది ఏమైనా ఏపీకి చెందిన మంత్రిగా ఉన్న లోకేష్ తన పలుకుబడిని జాతీయ స్థాయిలో ఒక క్రమపద్ధతిలో విస్తరించుకుంటున్నారు అన్న మాట అయితే గట్టిగా వినిపిస్తోంది.

**బెంగాల్**

జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ ఏపీ ఆర్థిక ప్రగతిపై సరికొత్త రికార్డు రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోల్‌కతాలో నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా.. ప్రస్తుతం 220 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తులో ఏకంగా 2.4 ట్రిలియన్ డాలర్ల మహా సామ్రాజ్యంగా విస్తరించడమే తమ కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఈ అద్భుత వృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలంటూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార వర్గాలకు ఆయన బహిరంగ పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు ఏ విధంగా దేశంలోనే అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా మారిందో వివరించడానికి మంత్రి లోకేష్ సరికొత్తగా 3ఎ సూత్రాన్ని తెరపైకి తెచ్చారు. మొదటి 'ఎ' అంటే స్పీడ్ , రెండో 'ఎ' స్టెబిలిటీ , మూడో 'ఎ' సర్వీస్ అని ఆయన అభివర్ణించారు. మీరు మాతో చేతులు కలిపిన మరుక్షణమే.. అది కేవలం మీ ప్రైవేట్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, మా ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా మారుతుంది. పారిశ్రామికవేత్తలు దశాబ్దాల తరబడి అనుమతుల కోసం తిరిగే రోజులకు ఏపీలో స్వస్తి పలికాం. స్పీడ్ గవర్నెన్స్ ద్వారా నిర్ణీత కాలంలోనే పనులు పూర్తి చేసి చూపిస్తాం అని లోకేష్ కార్పొరేట్ వర్గాలకు గట్టి నమ్మకాన్ని ఇచ్చారు. ఇదే తరుణంలో జాతీయ స్థాయిలో రాజకీయ స్థిరత్వాన్ని అందిస్తూ, దేశాన్ని సంస్కరణల వైపు నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.ఈ పర్యటనలో భాగంగా ఐసీసీ సదస్సుతో పాటు కోల్‌కతా కేంద్రంగా ఉన్న పలువురు ప్రముఖ జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు చెందిన టాప్ సీఈఓలతో విడివిడిగా భేటీ అయ్యారు. రాబోయే ఐదేళ్లలో ఏపీలో 78.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు తెచ్చిన నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ గురించి వారికి వివరించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారీ గ్రీన్ ఎనర్జీ హబ్‌ను ప్లాన్ చేస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు.. ఏపీలో ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం, పోర్టు ఆధారిత మౌలిక వసతుల వైపు దృష్టి సారించేలా లోకేష్ తన ప్రతిపాదనలను ముందుంచారు.మంత్రి లోకేష్ ప్రతిపాదించిన ఈ 2.4 ట్రిలియన్ డాలర్ల విజన్, త్రీ ఎస్ ఫార్ములా కోల్‌కతా పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కేవలం విధానాల ప్రకటనలకే పరిమితం కాకుండా, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ స్థాపన, ఐటీ కారిడార్ల విస్తరణ వంటి ప్రత్యక్ష ప్రాజెక్టులను లోకేష్ ఈ పర్యటనలో ప్రాజెక్ట్ చేశారు. ల్యాండ్ అక్విజిషన్ వేగవంతం చేస్తామని, పారిశ్రామికవేత్తలకు ఎర్రటి తివాచీ పరుస్తామని మంత్రి లోకేష్ ఇచ్చిన భరోసాతో బెంగాల్‌కు చెందిన పలు మల్టీనేషనల్ కంపెనీలు త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## ప్రకాశం వైసీపీకి దిక్కెవరు...

**ఒంగోలు, జూన్ 20, పెన్ పవర్:** వైసీపీకి గట్టి పట్టున్న జిల్లాగా ప్రకాశం జిల్లాకు పేరుంది. అలాంటి జిల్లాలో ఇపుడు ఫ్యాన్ రెక్కలు సరిగ్గా తిరగడం లేదని అంటున్నారు. జిల్లా మొత్తాన్ని నడిపే సమర్థ నాయకత్వం లేదని అంటున్నారు. గతంలో అయితే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంటి చేత్తో జిల్లా రాజకీయాలను చక్కబెట్టేవారు. ఆయన వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు. దాంతో వైసీపీకి నాయకత్వం కొరత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు ప్రకాశం జిల్లాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలను అందరినీ ఒకే త్రాటి మీదకు నడిపించే కో ఆర్డినేషన్ లేకుండా పోతోంది అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో చూస్తే కూటమి పటిష్టంగా ఉంది. బాలినేని జనసేనలో చేరికతో ఆ పార్టీ కూడా బలం పుంజుకుంది అని అంటున్నారు. ఇటీవల కాలంలో బాలినేనికి పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దాంతో బాలినేని రాజకీయంగా దూకుడు పెంచుతున్నారు. అది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతుందా అన్న చర్చ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వైసీపీ ఇంచార్జిలు అంతా యాక్టివ్ మోడ్ లో లేరని విమర్శలు విన వస్తున్నాయి. సొంతంగా స్థానిక సమస్యల మీద పోరు సలపడం లేదు అని అంటున్నారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాజ్యసభ సభ్యుడుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి ఎందుకో జిల్లా రాజకీయాల మీద అంతగా ఆసక్తిని చూపించడం లేదని అంటున్నారు. ఇక జిల్లా అధ్యక్షుడుగా జగన్ సన్నిహితుడైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఎక్కువగా తన సొంత నియోజకవర్గం దర్శి ప్రాంతాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. మరో వైపు చూస్తే అధినేత జగన్ ప్రకాశం జిల్లా మీద ఫోకస్ పెట్టి దిశా నిర్దేశం చేయాల్సిందే అని అంటున్నారు. అక్కడ సరైన నాయకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కూడా అంటునారు. నియోజకవర్గాల స్థాయిలో బలమైన నేతలు ఉన్నారని అంటున్నారు. అలాగే పార్టీకి మంచి ఓటు బ్యాంక్ కూడా ఉంది. మరి వీటిని దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేసే నేతల కోసమే సెర్చ్ చేయాల్సి ఉంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ప్రకాశంలో వైసీపీ వెలుగులు గత కాలం కాంతులు అన్న తీరుగానే ఉంటాయని కూడా అంటున్నారు. ముఖ్యంగా క్యాడర్ అయితే పూర్తిగా అసంతృప్తితో ఉందని కూడా గుర్తు చేస్తున్నారు.


# సాయికృష్ణ అదృశ్యం: రాజకీయ వివాదాల వేళ చంద్రబాబు కీలక నిర్ణయం!



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఉదంతం కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా బాధితులను పిలిపించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షాలు ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పోలీసులపై తీవ్ర విమర్శలు చేస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా జోక్యం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుందని అంటున్నారు. సాయికృష్ణ అదృశ్యంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకున్నారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, ఆయన మేనమామలను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన కుమారుడి అదృశ్యం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించాలని, నిజమైన దోషులను గుర్తించి న్యాయం చేయాలని విజయలక్ష్మి ముఖ్యమంత్రిని కోరారు. ఆమె ఆవేదనను విన్న చంద్రబాబు, ఘటనపై నిష్పక్షపాతంగా, పారదర్శకమైన దర్యాప్తు జరిపిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. బాధితులకు ధైర్యం చెబుతూ, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం రాజకీయ వివాదంగా మారడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సాయికృష్ణ అదృశ్యం వెనుక పోలీసుల హస్తం ఉందని, ఇది లాకప్ డెత్ అని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో కుల ప్రస్తావన తెరపైకి రావడంతో ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి మరింత పెరిగింది. ఇదే అంశంపై స్పందించిన ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, గురువారం సాయంత్రం సాయికృష్ణ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రతిపక్షం తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న తరుణంలో, ముఖ్యమంత్రి స్వయంగా బాధితులను పిలిపించి మాట్లాడటం రాజకీయంగా కీలక మలుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ తర్వాత బాధితులు కూడా సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. "ముఖ్యమంత్రి మా సమస్యను సావధానంగా విన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పిలిపించి మాట్లాడటం మాకు కొంత ఊరటనిచ్చింది, మాకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉంది" అని సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు.

# అపసోపాలు పడుతున్న అమరావతి, పోలవరం



**విజయవాడ, జూన్ 20, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రధానంగా వినిపించిన నినాదం ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం . గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ రెండు ప్రాజెక్టులు రివర్స్ టెండరింగ్, విధానపరమైన నిర్ణయాల వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయనే బలమైన విమర్శల మధ్య కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తీవ్రమైన చట్టపరమైన, ఆర్థికపరమైన, సాంకేతికపరమైన సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనల వల్ల అమరావతిలో దాదాపు 45,000 కోట్ల విలువైన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి అడవిని తలపించాయి. అటు పోలవరంలో గైడ్ బండ్ దెబ్బతినడం, డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. మొదటి ఆరు నెలల కాలాన్ని కేవలం నష్ట నివారణ చర్యలు, నిధుల సమీకరణకే కేటాయించాల్సి వచ్చింది. రాజధాని అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించింది. గత ఐదేళ్ల వైఫల్యాల వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ బ్యాంకుల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారు. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ల నుంచి ఉమ్మడిగా 15,000 కోట్ల ప్రత్యేక రుణాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ నిధులతో గతంలో ఆగిపోయిన ఐకానిక్ నిర్మాణాలు --- సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్, జడ్జీల క్వార్టర్ల నిర్మాణ పనులను నూతన ఎల్అండ్‌టీ , షాపూర్జీ పల్లోంజీ సంస్థలకు అప్పగించి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిలో గత రెండేళ్లలో మౌలిక వసతుల కల్పన 45 శాతం మేర పూర్తయింది. గతంలో నిలిచిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థలతో పాత ఒప్పందాలను పునరుద్ధరించడమే కాకుండా, దాదాపు 12 జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అమరావతిలో భూములు కేటాయించడం ద్వారా ఈ రెండేళ్లలోనే సుమారు 8,000 కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించగలిగారు.కూటమి ప్రభుత్వానికి అత్యంత సవాలుగా మారింది పోలవరం ప్రాజెక్టు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిగా పునర్నిర్మించాలా లేదా పాతదానికి మరమ్మతులు చేయాలా అనే సాంకేతిక మీమాంసకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం తెరదించింది. దెబ్బతిన్న పాత డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా దాదాపు 2,000 కోట్ల అంచనా వ్యయంతో నూతన వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో సఖ్యతను ఉపయోగించుకుని, పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ద్వారా 12,157 కోట్ల అదనపు నిధుల ప్యాకేజీని కూటమి ప్రభుత్వం మంజూరు చేయించుకోగలిగింది. ఈ రెండేళ్ల కాలంలో పోలవరం ప్రధాన డ్యామ్ పనులు, స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక 85 శాతం పూర్తయింది. కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులు, టన్నెల్ పనులలో గత రెండేళ్లలో 22 శాతం అదనపు పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని పునరావాస ప్రక్రియ కోసం సుమారు 5,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖజానా ఖాళీగా ఉండటం, భారీగా ఉన్న అప్పుల భారం వంటి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం అమరావతి - పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గడిచిన రెండేళ్ల డేటాను పరిశీలిస్తే.. ప్రచార ఆర్భాటాల కంటే క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పునరుద్ధరణ, కేంద్రం నుంచి నిధుల రాకపైనే ప్రభుత్వం ఎక్కువ విజయం సాధించిందని స్పష్టమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులను అధిగమించి చూపిస్తున్న ఈ పురోగతి.. రాబోయే మూడేళ్లలో ఏపీ అభివృద్ధి రథాన్ని మరింత వేగంగా ముందుకు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు నమ్మకంతో ఉన్నారు.

# 2027 వరల్డ్ కప్ కోసం కొత్త స్కెచ్.. కేఎల్ రాహుల్‌ను పక్కన పెట్టిన భారత్!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని చేపాక్ స్టేడియంలో భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ మొదట బ్యాటింగ్ తీసుకోగా, టీమిండియా చెపాక్ పిచ్‌పై టార్గెట్‌ను ఛేజ్ చేయడానికి రెడీ అయింది. అయితే, మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే భారత ఫ్యాన్స్ అందరినీ ఒకే ప్రశ్న వేధించింది.. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కేఎల్ రాహుల్ ఎందుకు లేదని.

**కేఎల్ రాహుల్ ఎందుకు ఆడట్లేదంటే?:**

ఫామ్‌లో ఉన్నప్పటికీ కేఎల్ రాహుల్‌ను ఈ మ్యాచ్ తుది జట్టు నుంచి తప్పించారు. దీనికి కారణం జట్టు కాంబినేషన్, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి టీమ్‌లోకి తిరిగి రావడం కోసమే.. సిరీస్ ఆల్రెడీ 2--0తో ఇండియా గెలవడంతో.. బెంచ్ స్ట్రెంత్‌ను పరీక్షించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ రాహుల్‌కు రెస్ట్ ఇచ్చి, ఆల్ రౌండ్ ఆప్షన్ కోసం మన తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకుంది. కేఎల్ రాహుల్‌తో పాటు జట్టులో మొత్తం మూడు మార్పులు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీష్ రెడ్డిలు టీమ్‌లోకి వచ్చారు.

**గిల్ మైండ్ గేమ్:**

భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. పిచ్ చాలా బాగుంది, ఒకవేళ మేము టాస్ గెలిచినా మొదట బ్యాటింగే తీసుకునే వాళ్లం.. గత మ్యాచ్ లాగే ఇక్కడ కూడా ఎండ చాలా ఎక్కువగా ఉంది. కానీ, ఈ మ్యాచ్‌లో మేము మొదట ఫీల్డింగ్ చేయాల్సి రావడం ఒక రకంగా మంచిదే. ఎందుకంటే, పెద్ద స్కోర్లను ఈజీగా, కన్‌సిస్టెంట్‌గా ఛేజ్ చేయడం అనే ఒక ఏరియాలో మేము ఇంకా పర్‌ఫెక్ట్ అవ్వలేదన్నాడు. ఈరోజు మా ఛేజింగ్ గేమ్ ఎలా ఉందో చూసేందుకు ఇదొక సూపర్ ఛాన్స్ అని గిల్ పేర్కొన్నాడు.

# జైస్వాల్ జోరు, రోహిత్ రచ్చ.. ఆఫ్ఘన్‌పై భారత్ ఘన విజయం.. 3-0తో సిరీస్ కైవసం!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియం వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత జట్టు అన్‌స్టాపబుల్ పర్ఫామెన్స్‌తో రచ్చ లేపింది. ఆఫ్ఘన్ నిర్దేశించిన 219 పరుగుల టార్గెట్‌ను ఇండియన్ బ్యాటర్లు ఆడుతూ పాడుతూ కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఊదేశారు. ఈ ఘన విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3--0తో క్లీన్ స్వీప్ చేసి ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది.

**షాహిదీ సెంచరీతో పోరాడిన ఆఫ్ఘన్:**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (5 వికెట్లు) పవర్ ప్లేలోనే చుక్కలు చూపించాడు. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడ్డ ఆఫ్ఘన్ జట్టును ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. అద్భుతమైన క్లాస్ ఇన్నింగ్స్ ఆడిన షాహిదీ వన్డేల్లో తన మొట్టమొదటి సెంచరీ (102 పరుగులు) నమోదు చేయగా, ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) అతనికి సూపర్ సపోర్ట్ ఇచ్చాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.

**రోహిత్-జైస్వాల్ రుద్రరూపం:**

219 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మలు బుల్లెట్ లాంటి స్టార్ట్ ఇచ్చారు. ఆఫ్ఘన్ బౌలర్లకు ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకుండా బౌండరీల వర్షం కురిపించారు. ఇద్దరూ పోటీ పడుతూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నాక మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే మొదటి వికెట్‌కు ఏకంగా 170 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను వన్ సైడ్ చేసేశారు.

# మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందే.. అర్జెంటీనాపై అల్జీరియా కంప్లైంట్.. రంగంలోకి ఫిఫా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 మెగా టోర్నీలో అర్జెంటీనా కెప్టెన్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హాట్రిక్ గోల్స్‌తో (3-0 తేడాతో అల్జీరియాపై విజయం) అదిరిపోయే స్టార్ట్ అయితే ఇచ్చాడు కానీ.. మ్యాచ్ ముగిశాక అసలైన లొల్లి మొదలైంది. ఈ మ్యాచ్‌లో రెఫరీ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అల్జీరియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమైక్య కు అధికారికంగా కంప్లైంట్ చేసింది. ముఖ్యంగా మెస్సీ చేసిన ఒక పౌల్‌కు రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందేనని అల్జీరియా పట్టుబడుతోంది.

**కాలితో తన్నిన మెస్సీ.. రెఫరీ సైలెంట్:**

మ్యాచ్ ఫస్ట్ హాఫ్‌లో అర్జెంటీనా 1--0తో ముందంజలో ఉన్న సమయంలో ఈ వివాదాస్పద ఘటన చోటు చేసుకుంది. బంతి కోసం పోటీ పడుతున్న క్రమంలో మెస్సీ తన బూటును పైకెత్తి అల్జీరియా కెప్టెన్ ఐస్సా మాండి పిక్కపై వెనుక నుంచి బలంగా తన్నాడు. అల్జీరియా ప్లేయర్లు దీనిపై గట్టిగా అప్పీల్ చేసినప్పటికీ, ఆన్-ఫీల్డ్ రెఫరీ కనీసం ఫౌల్ కూడా ఇవ్వలేదు.. అటు వీడియో అసిస్టెంట్ రెఫరీ కూడా దీనిని రివ్యూ చేయలేదు.

అల్జీరియా ఫుట్‌బాల్ ప్రతినిధి మాట్లాడుతూ.. మా కంప్లైంట్ ముఖ్యంగా మెస్సీ చేసిన ఆ ప్రమాదకరమైన ఫౌల్ గురించే.. దానికి ఖచ్చితంగా డైరెక్ట్ రెడ్ కార్డ్ ఇవ్వాలి.. అర్జెంటీనా మాకంటే బాగా ఆడిందనే విషయాన్ని మేము ఒప్పుకుంటాం, కానీ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు మేము సైలెంట్‌గా ఉండలేం.. మ్యాచ్‌లో ఇలాంటివి 3 సంఘటనలు జరిగాయి, దేనికీ VAR స్పందించలేదని ఆరోపించారు. అంతేకాదు, సెకండ్ హాఫ్‌లో అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్.. గాల్లోకి లేచి బంతిని హెడ్ చేసే క్రమంలో అల్జీరియా ప్లేయర్ ఇబ్రహీం మాజాను మోచేత్తో కొట్టాడని, దానికి కూడా రెఫరీ ఫౌల్ ఇవ్వలేదని అల్జీరియా పేర్కొంది.

**మెస్సీకి ఒక రూల్.. మాకో రూలా?:**

మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వకపోవడంపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్, ఎక్స్‌పర్ట్స్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. దీనిపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ హ్యూగో బ్రూస్ తీవ్రంగా విమర్శించారు. దాదాపు ఇలాంటి ఫౌల్ చేసినందుకే దక్షిణాఫ్రికా జట్టు మిడ్‌ఫీల్డర్ థెంబ జ్వానేపై ఫిఫా మూడు మ్యాచ్‌ల నిషేధం విధించింది. మరీ మెస్సీ విషయంలో జరిగిన దాన్ని చూశాక, మా ప్లేయర్‌కు ఇచ్చిన శిక్షను నేను అస్సలు ఒప్పుకోను.. మెస్సీ లాంటి క్వాలిటీ ప్లేయర్లు గ్రౌండ్‌లోనే ఉండాలి, అందులో డౌట్ లేదు.. కానీ ఒకే రకమైన తప్పుకు ఇద్దరు ప్లేయర్ల మధ్య రెఫరీలు ఇంత వ్యత్యాసం ఎలా చూపిస్తారో నాకు అర్థం కావడం లేదన్నారు.

## టాలీవుడ్‌లో నాగదుర్గకు భారీ అవకాశం



# యష్ 'టాక్సిక్'.. ఆ విషయంలో ఫెయిల్ అయ్యారా?



రాకింగ్ స్టార్ యష్ పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చేది కేజీఎఫ్ సిరీస్. ఆ సినిమాలతో ఆయన పాన్ ఇండియా స్టార్ గా క్రేజ్ సొంతం చేసుకున్నారు. అందుకే ఆయన నుంచి వచ్చే ప్రతి కొత్త ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉంటాయి. ప్రస్తుతం యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ కూడా అలాంటి అంచనాల మధ్య రూపుదిద్దుకుంటోంది. అయితే సినిమా రిలీజ్ డేట్ పై క్లారిటీ లేనప్పటికీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర చర్చ నడుస్తోంది.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న టాక్సిక్ ను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా యాక్ట్ చేస్తున్నారు. అలాగే హ్యూమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార వంటి స్టార్ బ్యూటీలు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్, స్టార్ క్యాస్ట్, ఇంటర్నేషనల్ రేంజ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఆ సినిమా మొదటి నుంచే హాట్ టాపిక్ గా మారింది. సినిమా ప్రకటించిన సమయంలో వచ్చిన పోస్టర్లు, కాన్సెప్ట్ వివరాలు అభిమానుల్లో మంచి ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా కేజీఎఫ్ తర్వాత యష్ ఎలాంటి కథను ఎంచుకున్నారనే విషయంపై నేషనల్ వైడ్ గా చర్చ జరిగింది. దీంతో టాక్సిక్ పై మొదటి నుంచే మంచి బజ్ ఏర్పడింది. అయితే ఆ బజ్ ను మేకర్స్ ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారనే అభిప్రాయం ఇప్పుడు కొందరిలో వ్యక్తమవుతోంది.సాధారణంగా భారీ పాన్ ఇండియా సినిమాలకు సంబంధించి తరచూ అప్డేట్లు, పోస్టర్లు, వీడియోలు లేదా షూటింగ్ విశేషాలు విడుదల చేస్తుంటారు. దీంతో సినిమా ప్రేక్షకుల దృష్టిలో కంటిన్యూగా ఉంటుంది. కానీ టాక్సిక్ విషయంలో అలాంటి ప్రమోషనల్ యాక్టివిటీ తక్కువగా కనిపించిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. సినిమా గురించి కొత్త సమాచారం లేకపోవడం, విడుదల తేదీపై కూడా స్పష్టత లేకపోవడం వల్ల మొదట్లో ఉన్న హైప్ కొంత తగ్గిందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టుకోవడం చాలా కీలకంగా మారింది. వరుస అప్డేట్స్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా చర్చల నుంచి కొంతకాలం దూరమవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే ఇప్పుడు టాక్సిక్ విషయంలో జరిగిందని కొందరు సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఆ వాదనతో ఎగ్రీ అవ్వడం లేదు. పెద్ద సినిమాల విషయంలో మేకర్స్ కొన్నిసార్లు కావాలనే సైలెంట్ స్ట్రాటజీ ఫాలో అవుతారని వారు గుర్తు చేస్తున్నారు. సరైన సమయంలో టీజర్, ట్రైలర్ లేదా గ్లింప్స్ విడుదల చేస్తే మళ్లీ సినిమా ఒక్కసారిగా వార్తల్లోకి వస్తుందని అంటున్నారు. యష్ కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఒక్క అప్డేట్ వచ్చినా సినిమా మళ్లీ ట్రెండింగ్ లోకి వెళ్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఏదేమైనా యష్ అభిమానులు కూడా సినిమా నుంచి కొత్త అప్డేట్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో మేకర్స్ ప్రమోషన్ల స్పీడ్ పెంచుతారా? ప్రస్తుతం తగ్గినట్లు కనిపిస్తున్న బజ్ మళ్లీ పీక్ రేంజ్ కు తీసుకెళ్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అలా టాక్సిక్ పై ఆసక్తి తగ్గలేదుగానీ, ఆ బజ్ ను కొనసాగించే విషయంలో మేకర్స్ మరింత జోష్ గా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం మాత్రం వినిపిస్తోంది.

## ఆయిషా శర్మ: ఆకర్షణీయమైన సొగసు మరియు పెరుగుతున్న స్టార్ ఇమేజ్



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965